# జీవితకాల సాధనా పురస్కారానికి నాగభూషణశర్మ ఎంపిక

తెనాలిటౌన్, ఫిబ్రవరి 17: కళారంగంలో విశిష్ట సేవలు అందించిన వారికి గుర్తింపుగా పట్టణ రంగస్థల కళాకారుల సంఘం తరపున ఏటా ప్రదానం చేస్తున్న జీవిత కాల సాధనా పురస్కారానికి 2009 సంవత్సరానికి మొదలి నాగభూషణశర్మను ఎంపిక చేసినట్లు పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు నాగళ్ళ వెంకట దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. పట్టణ గాంధీనగర్‌లో 1936 జూలై 24న జన్మించిన నాగభూషణశర్మ కాలగమనంలో ఉన్నత విద్యతో పాటు సాహితీ రంగంలో కూడా విశిష్టత చాటుకున్నారు. నాగభూషణశర్మ కలం నుండి జాలువారిన నాటకాలు, నాటికలు నాటి రోజుల్లో విశేష ప్రజాదరణ పొందాయి. విషాదాంతం, ప్రజా నాయకుడు ప్రకాశం, మన్మధుడు మళ్లీ పుట్టాడు, జంట పక్షులు, సంభవామి, నరజాతి చరిత్ర సమస్తం అనే నాటక రచనలు, అన్వేషణ, అడ్డదారి, ఆగస్టు15, జన్మభూమి, రాజదండం అనే నాటికలతో పాటు నాటక విమర్శనా గ్రంథాలు కూడా నాగభూషణశర్మ రచించారు. వీటిలో తెలుగు సాహిత్యం గాంధీప్రభావం నాటక కర్త చిలకమర్తి, తెలుగు నవలా వికాసం, నాటక శిల్పం, నాటక పదకోశం వంటి గ్రంథాలు, స్వీయ సంపాదకీయంలో వెలుగు చూసిన పుస్తకాలలో ఆచార్య ఆత్రేయ, నూరేళ్ళ తెలుగు నాటకరంగం, నూరేళ్ళ కన్యాశుల్కం, నాట్యకళపై రచించిన పుస్తకాలున్నాయి. కేవలం తెలుగ భాషా సాహిత్యానికే పరిమితం కాకుండా ఆంగ్లభాషలో కూడా పలు రచనలు చేశారు. వీటిలో బళ్ళారి రాఘవ, మాస్టర్ డిసైపుల్, ది ష్యాడో పప్పెట్ క్రియేటర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సురభి థియేటర్



మొదలైనవి. ప్రవృత్తి రీత్యా సాహితీ రచనలు చేసిన నాగభూషణశర్మ వృత్తి రీత్యా ఉస్మానియా యూనివర్సిటీలో ఆంగ్ల భాష శాఖాధిపతిగా పనిచేశారు. తెలుగు విశ్వ విద్యాలయం, కేంద్రీయ విశ్వ విద్యాలయం, ఉస్మానియా విశ్వ విద్యాలయాల్లో రంగ స్థల కళల శాఖకు ఆచార్యులుగా కూడా పనిచేశారు. ఇవే కాక దేశ వ్యాప్తంగా ఉన్న 20 విశ్వ విద్యాలయాల్లో ఆహ్వాన ఆచార్యులుగా కళా రంగానికి సేవలు అందించారు. సంస్కృతం, తెలుగు, ఆంగ్ల నాటకాలపై అధ్యయనం చేసిన నాగభూషణశర్మ, జాతీయ నాటకోత్సవాలను రాష్ట్రంలో ఆరుసార్లు నిర్వహించి బహు భాషా నాటకాలను ఆంధ్ర ప్రేక్షకులకు పరిచయం చేశారు. కాగా 2005 నుండి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం నిర్వహిస్తున్న ఈ పురస్కారాలకు నేతి పరమేశ్వరశర్మ (2005), చాట్ల శ్రీరాములు (2006), పద్మశ్రీ వేదాంతం సత్యనారాయణ శర్మ (2007), అన్నపరెడ్డి శివరామిరెడ్డి (2008) సంవత్సరాలకు పురస్కారాలు అందుకున్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మార్చి 8న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో 2009 సంవత్సరానికి తెలుగు, ఆంగ్ల భాషల్లో సాహితీ సౌరభాలను గుభాళింపజేసిన మొదలి నాగభూషణశర్మను జీవితకాల సాధనా పురస్కారంతో సత్కరించుకోవటం తమ అదృష్టంగా భావిస్తున్నామని కళాకారుల సంఘం అధ్యక్షులు నాగళ్ళ వెంకట దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు.